www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం    తెలుగు దినపత్రిక

సంపుటి - 4   సంచిక -129   ఆదివారం 23 ఆగస్టు 2026   ఎడిటర్ : మారేపల్లి అశోక్   పేజీలు 8  వెల - 3/-   01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం  తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

# విద్యా,పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

## కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ ఆగస్టు 22: (ప్రజావినికిడి):**
అత్యున్నత విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందించేందుకు తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేయాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి లండన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందాన్ని కోరారు. దీనికోసం విద్యారంగంలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో సమావేశం నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా పాల్గొన్నారు.

మిగతా 2లో.



# 10,060 ఉద్యోగాలు

**విడుదలైన ఏపీ జాబ్ క్యాలెండర్ -4 దశల్లో 10,060 ఉద్యోగాలు**

**సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వరుసగా నోటిఫికేషన్లు**

**అమరావతి ఆగస్టు 22:(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన “జాబ్ క్యాలెండర్–2026“ను విడుదల చేసింది.

మిగతా 2లో.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

- ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం
- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం
- యువతను లక్ష్యంగా చేసుకుని ‘యువ సంవాద్‘ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- యూపీ, పంజాబ్ ఎన్నికల సన్నద్ధతపై త్వరలో పార్టీ సమీక్ష
- ‘వందేమాతరం‘పై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ బీజేపీ తీర్మానం

2లో.




# 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు

**భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్**

2లో.



# సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు

**ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీ**

**బ్రిక్స్ దేశాల మంత్రుల సదస్సులో చంద్రబాబు**




**విశాఖపట్నం,ఆగస్టు 22: (ప్రజావినికిడి):**
ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీగా విశాఖపట్నం ఉందని ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన బ్రిక్స్ దేశాల యువజన, క్రీడ శాఖల మంత్రుల సాంస్కృతిక కార్యక్రమం 2026కు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు సీఎం స్వాగతం పలికారు. భారత తూర్పు తీరంలో విశాఖ దేశానికే ఆభరణమని అభివర్ణించారు.

మిగతా 2లో.

# కూలిన భవనం.. ఇద్దరి దుర్మరణం

- గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం
- ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి
- అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్టు గుర్తింపు
- క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు



**హైదరాబాద్‌ఆగస్టు 22: ((ప్రజావినికిడి):**
గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.

మిగతా 2లో.

# పెట్టుబడులకు తెలంగాణాని వేదికగా ఎంచుకోండి

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం
- టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు..అపార అవకాశాలు
- అభివృద్ధి... జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలి
- మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 22: ((ప్రజావినికిడి):**
తెలంగాణకు రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... తెలంగాణలోనే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను ఇక్కడే ఊహిద్దాం... ఇక్కడే ఆవిష్కరిద్దాం... ఇక్కడి నుంచే ప్రపంచానికి అందిద్దాం‘అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి,

మిగతా 2లో.






# రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

- తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం
- దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం
- ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్

**హైదరాబాద్ ఆగస్టు 22:(ప్రజావినికిడి):**
దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది.

మిగతా 2లో.

# 10,060 ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఆగస్టు 22, 2026న జీవో నెం.81ను జారీ చేశారు. ఈ నియామక ప్రక్రియను నాలుగు విడతల్లో పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీపీఎస్సీ, ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ (పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు), డీఎస్సీ వంటి నియామక సంస్థల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.ప్రభుత్వ ప్రాధాన్యతలైన మౌలిక సదుపాయాల కల్పన, విద్య, సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, "స్వర్ణాంధ్రఏ2047" లక్ష్యాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 10,060 పోస్టులను నాలుగు దశల్లో భర్తీ చేయనుండగా, వాటి షెడ్యూల్ కింది విధంగా ఉంది:మొదటి విడత: 1,523 పోస్టులు (ఇప్పటికే ఉన్నత విద్యా శాఖ 2026 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది).

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 సెప్టెంబర్ 15).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

ఇప్పటికే తొలి దశ నోటిఫికేషన్ జారీ కాగా, మిగతా మూడు దశల వివరాలు ఇవిగో!

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్: 2026 సెప్టెంబర్ 15)

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్-1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్-1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

గ్రూప్-1 సర్వీసులు (149 పోస్టులు): డిప్యూటీ కలెక్టర్: 11 డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ): 36 అసిస్టెంట్ కమిషనర్ (ఎస్టీ): 14 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-××: 12 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 35 డిప్యూటీ రిజిస్ట్రార్ (సహకార శాఖ): 10

ఇతర కీలక పోస్టులు (3,082): పోలీస్ శాఖ: సివిల్ ఎస్సై (182), ఏఆర్ ఎస్సై (116), సివిల్ కానిస్టేబుల్స్ (542), ఏఆర్ కానిస్టేబుల్స్ (205), కమ్యూనికేషన్ కానిస్టేబుల్స్ (200), ఏపీఎస్పీ ఎస్సై (71), ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ (80) సహా మొత్తం 1,500కు పైగా పోస్టులున్నాయి. ఇతర శాఖలు: వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (164), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (196), ఫైర్‌మెన్ (158), జైలు వార్డర్లు (171), హార్టికల్చర్ ఆఫీసర్ (45), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-××× (దేవాదాయ శాఖ) (104).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ దశలో గ్రూప్-2, ఇంజనీరింగ్, ప్రొహిబిషన్ శాఖల్లోని కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు.

గ్రూప్-2 సర్వీసులు (673 పోస్టులు): డిప్యూటీ తహశీల్దార్: 200 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 176 గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్ (జీఎస్టీఓ): 40 ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సబ్-ఇన్‌స్పెక్టర్: 25 సబ్-రిజిస్ట్రార్ గ్రేడ్-××: 7 సచివాలయం, హెచ్ఓడీలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, అకౌంటెంట్లు.

ఇంజనీరింగ్, ఇతర పోస్టులు (1,638): అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ): ఇరిగేషన్ (224), పంచాయతీరాజ్ (100), గ్రామీణ నీటి సరఫరా (73), ఆర్&బీ (75) సహా పలు శాఖల్లో మొత్తం 428 పోస్టులు.

విద్యుత్ సంస్థల్లో ఏఈఈలు: ఏపీ ట్రాన్స్‌కో (200), ఏపీ జెన్‌కో (100), డిస్కంలు (మొత్తం 329) కలిపి 629 పోస్టులు.

ఇతరాలు: ప్రొహిబిషన్ & ఎక్సైజ్ కానిస్టేబుల్ (400), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (50).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ విడత దాదాపు పూర్తిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి (మెగా డీఎస్సీ) కేటాయించారు.

పాఠశాల విద్యా శాఖ (2,991 పోస్టులు): సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్లు, ఇన్‌స్ట్రక్టర్లు, డీఈవో పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను సంబంధిత డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు.

వయోజన విద్య: అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 4 ఉన్నాయి.

ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సంబంధిత శాఖలు వెంటనే ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లు, అర్హతలకు సంబంధించిన సమాచారాన్ని నియామక సంస్థలకు అందించాలని ఆదేశించారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్, రిజర్వేషన్ పాలసీ, సర్వీస్ రూల్స్‌ను కచ్చితంగా పాటిస్తూ నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ భారీస్థాయి నియామక ప్రకటనతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులలో కొత్త ఆశలు చిగురించాయి..

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

**ఢిల్లీ ఆగస్టు 22:(ప్రజావినికిడి):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి.




ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు.అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జులతో మరో సమావేశం నిర్వహించనున్నారు.

**'వందేమాతరం'పై బీజేపీ తీర్మానం**

ఇదే సమయంలో, 'వందేమాతరం' గౌరవాన్ని, చారిత్రక వారసత్వాన్ని కాపాడతామంటూ బీజేపీ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1937 నాటి తీర్మానానికి కట్టుబడి, జాతీయ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరాన్ని కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వందేమాతరం చరిత్ర, ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది.

# పెట్టుబడులకు తెలంగాణాని వేదికగా ఎంచుకోండి

**మొదటిపేజీ తరువాయి**

పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శనివారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2026'లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు. ౹÷లంగాణ అభివృద్ధి ప్రస్థానం కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2025?26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (ఉ÷ూఆఖ) సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ÷ఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్?2047' దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశర చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు. ఈ లక్ష్యసాధన కోసం రాష్టాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే అజఖీఇ, నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే ఖజఖీఇ, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే ఖీంఖీఇ? ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి... ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతిఫలించాలి' అని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతాలకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలుమూలలా విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాపార సంస్థలు తెలంగాణను కేవలం మార్కెట్‌గా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, ప్రపంచ మార్కెట్లకు విస్తరణకు వ్యూహాత్మక కేంద్రంగా చూడాలని కోరారు. తాను నిర్వహిస్తున్న నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల పరిధిని ప్రస్తావిస్తూ నీరు?వ్యవసాయం?ఆహార భద్రత?పరిశ్రమల మధ్య ఏర్పడుతున్న అనుసంధానం భవిష్యత్ పెట్టుబడులకు మరో విశాలమైన ద్వారం తెరుస్తోందని ఉత్తమ్ చెప్పారు.

# సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు

**మొదటిపేజీ తరువాయి**

సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖను పిలుస్తారని బ్రిక్స్ దేశాల మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లో విశాఖ నగరం అగ్రస్థానంలో ఉందని ఉద్ఘాటించారు. మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీ - ఇన్నోవేషన్ హబ్‌గా విశాఖను తీర్చి దిద్దుతున్నట్లు వ్యాఖ్యానించారు. వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరిజానికి విశాఖలో అపార అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. యువత ఆకాంక్షలకు ప్రతీకగా విశాఖ నగరాన్ని తీర్చి దిద్దుతున్నట్లు పేర్కొన్నారు. భాష, సంస్కృతి, భౌగోళికంగా భిన్నమైనా.. క్రీడలతో బ్రిక్స్ దేశాల ఐక్యత ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. క్రీడలు పోటీ మాత్రమే కాదని... సంస్కృతి, జీవన విధానమని తెలిపారు. యువతలో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు, యోగా, ధ్యానం వంటివి భారతీయ విధానమని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన పౌరులతోనే బలమైన సమాజం ఉంటుందని వివరించారు. క్రీడలతో అ÷-లథెట్లు, కోచ్‌లు, ట్రైనర్లకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ టూరిజంతో పెట్టుబడులు, అంతర్జాతీయ ఈవెంట్లకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో స్టేట్ అకాడమీలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో సమగ్ర క్రీడా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కేంద్రంగా పూర్తి స్థాయి స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ వస్తుందని స్పష్టం చేశారు. నెల్లూరు కేంద్రంగా స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, అపెరల్, టెక్నాలజీ తయారీ కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా విశాఖను తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రపంచ స్థాయి క్రీడా ఈవెంట్ల నిర్వహణెళి లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. బ్రిక్స్ దేశాలతో క్రీడా భాగస్వామ్యానికి ఏపీ సిద్ధమని వివరించారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తున్నామని వెల్లడించారు. బ్రిక్స్ దేశాల మధ్య అ÷-లథెట్లు, కోచ్‌ల పరస్పర మార్పిడికి అవకాశం ఉందని చెప్పారు. వాటర్ స్పోర్ట్స్, అంతర్జాతీయ ఈవెంట్లు, స్పోర్ట్స్ టూరిజంలో పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని అన్నారు. నైపుణ్యం కలిగిన యువత, సాంకేతిక వ్యవస్థ, సుదీర్ఘ తీరప్రాంతం ఏపీ బలమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కూలిన భవనం..ఇద్దరి దుర్మరణం

**మొదటిపేజీ తరువాయి**

మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్‌ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.

'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

## విద్యా,పరిశోధనలకుకేంబ్రిడ్జ్ సహకారం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట, 'ఫ్రూగల్ ఏఐ' కో-చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్ర మాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొనేందుకు వారు అంగీకరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలనే 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూరుస్తున్నదని చెప్పారు.

సీఎంతో లివర్‌పూల్ ప్రతినిధుల భేటీ

లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఆసక్తి చూపారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేయడానికి లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శిస్తామని తెలిపింది.

## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

**మొదటిపేజీ తరువాయి**

ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది.

ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు.ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

## రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు బ్రేక్.. కేంద్రంపై ఖర్గే ఫైర్

**ఢిల్లీ ఆగస్టు 22:(ప్రజావినికిడి):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సాగాల్సిన ఈ పర్యటనను కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఖర్గే, విదేశీ పర్యటనల ద్వారా ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాలకు పెట్టుబడులను ఆహ్వానిస్తారని పేర్కొన్నారు. "అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్నారు. రాష్ట్రాల్లో పరిశ్రమల స్థాపనకు వారిని ఆహ్వానించేందుకే ముఖ్యమంత్రులు ఇటువంటి పర్యటనలు చేపడుతుంటారు. అలాంటి కీలక పర్యటనకు అనుమతి నిరాకరించడం అన్యాయం" అని ఆయన మండిపడ్డారు.

"కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తోంది, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి విషయంలో మాత్రం వివక్ష చూపుతోంది" అని మల్లికార్జున ఖర్గే ఆక్షేపించారు. విదేశీ పెట్టుబడులు రావడం వల్ల రాష్ట్రంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుందని, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.


ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, రాష్ట్రాలకు లభించే పెట్టుబడులు అంతిమంగా దేశాభివృద్ధికి తోడ్పడతాయని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి కీలక పర్యటనలను అడ్డుకోవడం ద్వారా తెలంగాణ ప్రగతికి విఘాతం కలిగించేలా కేంద్రం వ్యవహరించడం సరికాదని మల్లికార్జున ఖర్గే హితవు పలికారు.

## 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు

### భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 22:(ప్రజావినికిడి):**



రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమిషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమిషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 23 ఆగస్టు 2026

# తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక తెలుగుదేశం పార్టీ..

## జోగులాంబ అమ్మవారి అమ్మవారిని దర్శించుకున్న బక్కని నరసింహులు

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంబండా వర్గాలకు స్వాతంత్ర అనంతరం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ గత ప్రభుత్వాలు చేయలేని రెండు రూపాయల కిలో బియ్యాన్ని రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలకు అందించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆధ్వర్యంలోని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినాక ప్రజలకు చేరువైన అనేక సంక్షేమ పథకాలలో కొన్ని ముఖ్యంశాలు పక్కా గృహాలు, ప్రజలలో రాజకీయ చైతన్యం,అందరికీ విద్య,నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అలాగే రాజధాని హైదరాబాదులో శాంతి భద్రతలు కాపాడడంతో పాటు మహిళా సాధికారతకు,
మహిళా గ్రూపులను,అదేవిదంగా డ్వాక్రా భవనాలను నిర్మించి మహిళలను ఆర్థికంగా సామాజికంగా ప్రోత్సహించిందనిజన్మభూమి కార్యక్రమం ద్వారా గ్రామాలు పాఠశాలల పరిశుభ్రత వంటి అనేక ఎన్నో కార్యక్రమాలను ప్రజలకు చేరవేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు.ఎస్సీలకు ఆశ్రమ పాఠశాలలను నిర్మించడం ఎస్సీ ఎస్టీ కమిషన్ ను ఏర్పాటు చేసి సుపరిపాలనను ప్రజల వద్దకు తీసుకు రావడం ఒక తెలుగుదేశం పార్టీకే చెందిందన్నారు.
అదేవిధంగా వన సంరక్షణ, హైదరాబాదులో ఐటి రంగం ద్వారా యువతకు ఉపాధి,ప్రభుత్వ ఫలాలను




ప్రజలకు చేరవేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని స్వాతంత్ర అనంతరం1956 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రి ఎవరు పట్టించుకోని జోగులాంబ మాత ఆలయాన్ని గ్రూపు టెంపుల్ పథకం కింద నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.అనేక అభివృద్ధి కార్యక్రమాలకు అందజేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని స్వార్ధపరులు ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారు. మన దేశంలోని ప్రాంతాలు భాషలు వేరైనా మనమంతా భారతీయులమే అని అన్నారు. బక్కని నర్సింలు జాతీయ పార్టీలు ఉత్తర భారతదేశం నుండి దక్షిణ భారత దేశంలో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజలకు సేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ లోని హైదరాబాద్ లోనే పుట్టిందని తెలుగుదేశం పార్టీకి ప్రాంతీయ భేదాలు లేవని ప్రజల కోసమే తెలంగాణ రాష్ట్ర విభజనకు నాటి టిడిపి పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కేంద్రానికి లేక పంపింది అన్నారు.నేడు కొంతమంది రాజకీయ నాయకులు ప్రాంతీయ విభాగాలు సృష్టిస్తున్నటువంటి స్వార్ధపరులకు నాది ఒకటే హెచ్చరిక తెలుగుదేశం పార్టీ అంటే ఆంధ్రుల పార్టీ కాదు తెలుగు ప్రజల గుండె నిండా ఉన్నటువంటి పార్టీ తెలుగుదేశం పార్టీ సబ్బండ వర్గాలకు రాజకీయాన్ని అతి చేరువ చేసినటువంటి పార్టీ ప్రజల హృదయంలో ఎప్పటికీ నిలిచిపోతుంది అని అన్నారు బక్కని నరసింహులు,
అలాగే పార్టీ కష్టకాలంలో కూడా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1,80,000 సభ్యత్వాలు నమోదు చేయడం జరిగింది దీన్ని బట్టి రాబోవు రోజులలో తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం అందుకుంటుంది అని బక్కని నరసింహులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, మైనారిటీ నేతలు అబ్దుల్ ముజీబ్,వనపర్తి చంద్రశేఖర్,వెంకటేష్ యాదవ్,హాజీ, అబ్దుల్ ష ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి సేవలు చిరస్మరణీయం

### షాద్‌నగర్‌లో ఘనంగా జయంతి వేడుకలు..

### విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దంగు శ్రీనివాస్ యాదవ్..





**షాద్‌నగర్, (ప్రజావినికిడి):** రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి జయంతిని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దంగు శ్రీనివాస్ యాదవ్ హాజరై రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి సేవలను స్మరించుకున్నారుఈ సందర్భంగా దంగు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, విద్య,సమాజ సేవ,ప్రజా సంక్షేమం కోసం రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన సేవా స్ఫూర్తిని నేటి తరానికి ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.
కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు,స్థానిక నాయకులు, యువకులు తదితరులు పాల్గొని రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కొప్పుల మదన్ మోహన్ రెడ్డి, చెంది మహేందర్ రెడ్డి,జి.శ్రీనివాస్ రెడ్డి,పి.చెన్న రెడ్డి,వెంకటయ్య యాదవ్,దర్శన్ గౌడ్డిజి,శంకర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు .

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం చట్టసభల్లో ప్రజల పక్షావ పోరాటం చేయండి.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ వినతి పత్రం

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో ఏకో టౌన్ పేరుతో డంపింగ్ యార్డు ను ఏర్పాటు చేయడం కోసం 86 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీ కి బదలాయిస్తూ జీవో ఆర్టీ నెంబర్ 641ని తీసుకు రావడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ ను కలసి ఈ జీవో రద్దు కోసం చట్టసభల్లో ప్రజల పక్షావ పోరాటం చేయాలని సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వినతి పత్రం అడజేశారు.ఈ డంపింగ్ యార్డు ఏర్పాటు వలన విపరీతమైన దుర్వాసనతో పాటు అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశంఉంది.పర్యావరణానికి, ప్రజారోగ్యానికి,ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన నష్టాలు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు.చెత్తనుండి విడుదలయ్యే విషపూరిత ద్రవం (లీచెట్) భూమిలోని భూగర్భ జలాలను కలుషితం చేస్తుంది.చెత్త కుళ్ళడం వల్ల మీథేన్,కార్బన్ డయాక్సైడ్,హైడ్రోజెన్ సల్ఫేట్ లాంటి వాయువులు విడుదల అవుతాయి.ఈ వాయు కాలుష్యం వల్ల శ్వాస కోశ సమస్యలు అస్తమా, అలర్జీలు,చర్మ వ్యాధులు సంభవిస్తాయి. వాతావరణంలో మార్పులకు దోహదం చేస్తాయి.మిథేన్ వాయువు వల్ల మంటలు చెలరేగే ప్రమాదం ఉంది అన్నారు.అంతే కాకుండా ఈ కలుషిత నీరు ఈ ప్రాంతంలో ఉండే గొలుసుకట్టు చెరువుల గుండా హైదరాబాద్ కు తాగు నీరు అందించే హిమాయత్ సాగర్ లో కలుస్తుంది.అక్కడి ప్రజలు కోడా అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. ఒక పక్క మూసి సుందరీకరణ



పేరుతో కాలుష్యాన్ని తగిస్తాం అంటూనే మళ్ళా ఈ కాలుష్య నీటిని మూసిలోకే వదలటం అంటే సుందరీకరణకు అర్థం లేకుండా పోతుంది. విమానాశ్రయం దగ్గర ఉండటం వల్ల ఈ డంప్ యార్డు కు వచ్చే పక్షుల తో విమానాలకు ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు.ఈ ప్రతిపాదిత డంప్ యార్డు ప్రాంతంలో భూగర్భ గ్యాస్ లైన్ కోడా ఉండటం భారీ ప్రమాదాలకు నిలయంగా కోడా మారవచ్చు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పడిపోయే అవకాశం ఉంది. భవిషత్ తరాలకు స్వచ్ఛమైన గాలి,నీరు,ఆహారం లభించటం కష్టమవుతుంది అని తెలిపారు.
సిద్ధాపూర్ తో పాటు సుమారు 50 గ్రామాల ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతుందని, ఇప్పటికే మీరు రద్దు కోసం కృషి చేస్తున్నట్లు చూస్తున్నామని,ఈ డంపు యార్డు ను రద్దు చేయాలని,జీవో ఆర్టీ నెంబర్ 641 ను వెనక్కి తీసుకునేలా మీ ప్రభుత్వం పై ప్రజల తరుపున చట్ట సభల్లో పోరాటం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ,నా వంతు కృషి చేస్తున్నట్లు మీరు గుర్తించారు కదా,తప్పకుండా డంపింగ్ యార్డు రద్దు కోసం చట్ట సభలో పోరాటం చేస్తా..నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్,కన్వీనర్ పినపాక ప్రభాకర్,కో చైర్మన్లు బొజ్జ శ్రీనివాస్ రెడ్డి,వడ్డే బాలయ్య,ఈశ్వర్ నాయక్,భూక్యా రజిత కో కన్వీనర్లు రవీంద్రనాథ్,శ్రీకాంత్,పవన్ చౌహాన్,మహేష్, సలహాదారులు అబ్దుల్ రబ్ జామి,నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యూ జెడ్ 11 మార్కెట్ లోకి విడుదల




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** అధిక పనితీరు గల స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ విద్యార్థుల రోజువారీ జీవితాన్ని మరింత ఉత్పాదకంగా, సమర్థవంతంగా, సులభంగా మార్చేలా రూపొందించిన ఐక్యూ జెడ్ 11 5జీ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. లైవ్ లెక్చర్లను సారాంశంగా మార్చడం, అసైన్‌మెంట్‌లను మెరుగుపరచడంవివిధ డాక్యుమెంట్లపై పని చేయడం, కంటెంట్‌ను ఆస్వాదించడం, స్నేహితులతో కనెక్ట్‌గా ఉండటం వంటి రోజువారీ అవసరాల కోసం ఏఐ ఆధారిత ఉత్పాదకత ఫీచర్లు,తన విభాగంలో అగ్రశ్రేణి పనితీరు, పెద్ద ఇమర్సివ్ డిస్‌ప్లే,రోజంతా విశ్వసనీయమైన బ్యాటరీ లైఫ్‌ను ఐక్యూ జెడ్ 11 5జీ అందిస్తుంది. ఈ అన్ని ఫీచర్లను సన్నని, మన్నికైన డిజైన్లో అందించడం ద్వారా విద్యార్థుల రోజువారీ అవసరాలకు అనుగుణంగా సమగ్ర స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని అందించేలా ఐక్యూ జెడ్ 11 5జీ నురూపొందించారు.

## షాద్‌నగర్ చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గంను

# సన్మానించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ చేనేత సహకార సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శనివారం రోజు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సంఘం అభివృద్ధి,చేనేత కార్మికుల సంక్షేమానికి సంబం ధించిన అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఈసన రామస్వామి, ప్రధాన కార్యదర్శి చెన్న బాలరాజు, కోశాధికారి అడ్డేట్ల రాజు,డైరెక్టర్లు ఉడుత శేఖరయ్య,ఈసన అంజయ్య,ఈసన శివకుమార్,ఈసన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నా ప్యాంటు పట్టి లాగాడు

## ట్రాఫిక్ సిఐ శంకరయ్య వివరణ

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రైతు చొక్కా పట్టి లాగిన ట్రాఫిక్ సీఐ పై ఫిర్యాదు జరిగిన సంఘటనలో షాద్ నగర్ ట్రాఫిక్ సీఐ శంకరయ్య మీడియాకు వివరణ ఇచ్చారు.సోషల్ మీడియాలో సిఐ శంకరయ్య పై వీడియో వైరల్ కావడం అదేవిధంగా అతనిపై ట్రాఫిక్ డిసిపికి ఫిర్యాదు చేస్తున్నట్లు చేవెళ్ల మండలం కమ్మెట గ్రామానికి చెందిన రైతు ఫిర్యాదు చేసిన సంఘటనపై ఆయన స్పందించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్నప్పుడు సదరు డ్రైవర్ ను తను పట్టుకోవడం జరిగిందని ఈ సందర్భంగా రైతు కాంత్ రెడ్డి తన ప్యాంటును లాగాడని అతని కుమారుడు కూడా తన పట్ల దురుసుగా ప్రవర్తించాడని ఈ సందర్భంగా తాను కూడా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ శంకరయ్య తెలిపారు.



# సురవరం సుధాకర్ రెడ్డి మహా త్యాగశీలి : బుద్ధుల జంగయ్య



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి,మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మహా గొప్ప త్యాగశీలి అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్ధుల జంగయ్య కొనియాడారు. సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా బుద్ధుల జంగయ్య మాట్లాడుతూ, సురవరం సుధాకర్ రెడ్డి జీవితం నేటి కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలకు ఆదర్శప్రాయమని అన్నారు. కార్యకర్తల పట్ల, పార్టీ నాయకుల పట్ల ఆయన ఎంతో ప్రేమాభిమానాలతో ఉండేవారని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై పార్లమెంటులోనూ,బయటా ఎన్నో పోరాటాలు నిర్వహించిన మహాయోధుడు సురవరం సుధాకర్ రెడ్డి అని పేర్కొన్నారు.తన జీవితకాలాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ),ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన సుధాకర్ రెడ్డి.. మరణానంతరం కూడా భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారని బుద్ధుల జంగయ్య అన్నారు.తన పార్థివ దేహాన్ని గాంధీ ఆసుపత్రికి వైద్య విద్యార్థుల పరిశోధన, విద్యాభ్యాసం కోసం దానం చేయడం ఆయన గొప్ప సంకల్పానికి నిదర్శనమన్నారుతన మరణం అనంతరం కూడా తన శరీరం వైద్య విద్యార్థుల చదువులకు ఉపయోగపడాలని, వారు పరిశోధించి నేర్చుకుని భవిష్యత్తులో గొప్ప వైద్యులుగా తయారై ప్రజలకు సేవ చేయాలనే మహోన్నత ఉద్దేశంతో పార్థివ దేహాన్ని దానం చేశారని తెలిపారు. అలాంటి మహనీయుడి ఆశయాలను సీపీఐ కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లేడు-చౌదరిగూడ మండల కార్యదర్శి,జిల్లా సమితి సభ్యులు జిల్లెల్ల వెంకటేష్, నాయకులు పి. జంగయ్య,సి. జంగయ్య,బి. యాదయ్య, ఎం.డి.రఫీ, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సరదాగా కాసేపు,,

**జర్నలిస్ట్ కేపీ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**కోడలు వివాహానికి ఆహ్వానం.. ఆత్మీయ అతిథికి జర్నలిస్ట్ కేపీ స్వాగతం**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** జర్నలిస్ట్ కేపీ.. ఈ పేరు వింటే ఎమ్మెల్యే శంకర్ కు ఎంతో అభిమానం.. అదేవిధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. పేరు వింటేనే జర్నలిస్టు కేపీకి మరపురాని అనుబంధం.. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు మిత్రులు ఒకరినొకరు కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. తన మేన కోడలి వివాహాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా ఆహ్వానం పలికేందుకు జర్నలిస్టు కేపీ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా జర్నలిస్టు కేపీతోపాటు ఆయన సతీమణి శ్యామల, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఆత్మీయంగా స్వాగతం పలికారు. ప్రేమ పూర్వకంగా ఎమ్మెల్యేను పలకరించారు. ఎమ్మెల్యే కూడా వారిని ఆత్మీయంగా పలకరించి తన కోడలి వివాహానికి కుటుంబ సమేతంగా రావాలని ఆహ్వానించారు. పూర్వం నుంచి మిత్రులుగా ఉన్న ఈ ఇద్దరి కలయిక ఆసక్తిని కలిగించింది. ఒకరినొకరు ప్రేమగా పలకరించుకోవడం ఆకట్టుకుంది. మంచి మిత్రులుగా పేరు పొందిన ఈ ఇద్దరి కలయిక ఎప్పుడు ప్రత్యేకమే. జర్నలిస్ట్ కేపీ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే శంకర్ కొద్దిసేపు సరదాగా కాలక్షేపం చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,చెంది తిరుపతి రెడ్డి, సర్పంచ్ చందు నాయక్,మాజీ ఉప సర్పంచ్ సీతారాం తదితరులు ఉన్నారు.

# మిలాద్ ఉన్ నబీ ర్యాలీకి అనుమతి కోరుతూ పోలీసు శాఖకు వినతి

**షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణను కలుసుకున్న నేతలు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఈ నెల 26వ తేదీన మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న మిలాద్ ఉన్ నబీ ర్యాలీకి అనుమతి, పోలీసు బందోబస్తు కల్పించాలని కోరుతూ సయ్యద్ ముక్తదీర్ అలీ షాద్‌నగర్ పోలీసులను కోరారు. ఈ మేరకు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఫరూఖ్‌నగర్ మండలం ఖాజీపూర్‌కు చెందిన తాను, మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఈ నెల 26-08-2026న మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ర్యాలీ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ర్యాలీ షాద్‌నగర్ పట్టణంలోని జామా మసీదు నుంచి మెయిన్ రోడ్డు,చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా,గాంధీ చౌక్,కాసర్ మజీద్ మీదుగా ఆర్యన్ హోటల్ వెనుక ఉన్న వాటర్ ట్యాంక్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో సుమారు 2,500 నుంచి 3,000 మంది పాల్గొనే అవకాశం ఉందని,ర్యాలీకి అవసరమైన పోలీసు అనుమతితో పాటు బందోబస్తు కల్పించాలని కోరారు. ర్యాలీని తమ ఆధ్వర్యంలో పూర్తిగా శాంతియుతంగా నిర్వహిస్తామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ర్యాలీ నిర్వహణకు సంబంధించిన పూర్తి బాధ్యత తమదేనని పేర్కొంటూ పోలీసుల నుంచి అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మైనార్టీ నేతలు జమ్రుద్ ఖాన్, ఎంఐఎం నేత ఎండి గౌస్, ఎజాజ్ అడ్డు, మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, బాబాగోరి, మహమ్మద్ సర్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్ చైర్‌పర్సన్స్ అవార్డుతో మహ్మద్ ఇష్తియాక్ గుల్షానికి సత్కారం




**హైదరాబాద్,(ప్రజావినికిడి): ఆగస్టు 22:** హైదరాబాద్‌లోని మైదాన్ ఎక్స్‌పో సెంటర్‌లో జరిగిన భారత్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2026లో సరూర్ నగర్ లయోలా హైస్కూల్ చైర్మన్, ప్రముఖ విద్యావేత్త మహ్మద్ ఇష్తియాక్ గుల్షానికి ప్రతిష్టాత్మకమైన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్ చైర్‌పర్సన్స్ అవార్డుతో సత్కరించారు. డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్ అవార్డులలో భాగంగా ప్రదానం చేసిన ఈ పురస్కారం, యువ అభ్యాసకులను తీర్చిదిద్దడంలో, వారికి జీవితానికి అవసరమైన నైపుణ్యాలను అందించడంలో ఆయన చేసిన అంకితభావంతో కూడిన కృషిని, వినూత్న విధానాన్ని గుర్తించి అవార్డును ప్రధానం చేశారు. విద్యారంగానికి చెందిన విద్యావేత్తలు, పాఠశాల నాయకులు, ఇతర భాగస్వాములను ఒకచోట చేర్చే ఈ భారత్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2026ను ఈకే ఉపదేశ్ మీడియా,టైమ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గుర్తింపునకు కృతజ్ఞతలు తెలుపుతూ,ఈ గౌరవాన్ని లోయోలా ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అంకితం చేశానన్నారు. వినూత్నమైన, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడానికి,విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి దోహదపడటానికి ఈ పురస్కారం తనను మరింతగా ప్రేరేపిస్తుందని ఆయన అన్నారు. ఈ పురస్కార ప్రదానోత్సవం 2026 ఆగస్టు 21,22 తేదీలలో హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన పుర:ప్రముఖుల పెద్ద ఎత్తున హాజరై పాల్గొన్నారు.

# హెచ్ పి వి టీకా తీసుకుందాం గర్భాశయం ముఖద్వారా క్యాన్సర్ ను నివారిద్దాం

**హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఫరుక్ నగర్ మండలం మొగిలిగిద్ద లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు 8,9 అలాగే 10 వ తరగతి అమ్మాయిలకు హెచ్ పి వి వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు. హెచ్ పి వి అనగా ఉమెన్ పాపిలోమా వైరస్ అనే,చాలా సాధారణమైన వైరస్ అని,ఈ హెచ్ పి వి వైరస్ లో కొన్ని అధిక ప్రమాద రకాలు భవిష్యత్తులో గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ ను మరియు ఇతర క్యాన్సర్లకు కారణం అవుతాయని , ప్రపంచవ్యాప్తంగా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ కేసులలో దాదాపు 95 శాతం కంటే ఎక్కువ హెచ్ పి వి వైరస్ తో సంబంధం కలిగి ఉన్నాయని తెలియజేశారు. వ్యాక్సిన్ ఎందుకు వేసుకోవాలి అంటే,హెచ్ పి వి సంక్రమణ మరియు దానివల్ల వచ్చే గర్భాశయం ముఖ ద్వారా క్యాన్సర్ ను నివారించడంలో అత్యంత ప్రభావంతమైన రక్షణ కలిగిస్తుంది అని,అందువలన ఈ వ్యాక్సిన్ వేసుకోవాలి అని జె శ్రీనివాసులు చెప్పారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వారు హెచ్పీవీ వ్యాక్సిన్ క్లీన్ కాల్ ట్రయల్స్ పరీక్షించిన తర్వాత విస్తృత వినియోగంలో ఉన్న భద్రతా సమాచారాన్ని డబ్ల్యూహెచ్ఓ సమీక్షించగా,ఈ వ్యాక్సిన్ సురక్షితమైనది సమర్థవంతమైనది అని డబ్ల్యూ హెచ్ వో వారు పేర్కొన్నారని చెప్పారు. ఈ టీకా సాధారణ టీకా వేసిన ప్రదేశాలలో వేస్తారు. టీకా వేసినప్పుడు కొద్దిగా నొప్పి/వాపు,స్వల్ప జరము, అలసట లేదా తలనొప్పి వంటి తాత్కాలిక లక్షణాలు మాత్రమే కనిపిస్తాయి కానీ ఎలాంటి ఇబ్బందులు లేవు అని చెప్పారు. ఈ వ్యాక్సిన్ ను ప్రస్తుతము 14 సంవత్సరము నుండి 15 సంవత్సరంలోపు అమ్మాయిలు మాత్రమే తీసుకోవాలని తెలియజేశారు. ఈ టీకా భవిష్యత్తులో గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని,కాబట్టి హెచ్పీవీ వ్యాక్సిన్ గురించి భయపడకుండా ఆరోగ్య సిబ్బంది చెప్పినట్లు సూచనలు పాటిస్తూ అందరూ తప్పకుండా హెచ్ పివి వ్యాక్సిన్ తీసుకోవాలని, టీకా నేడు ఆరోగ్యకరమైన"భవిష్యత్తు రేపు అని హెల్త్ ఎడ్యుకేటర్ జే.శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎమ్ పుష్పలత,కేజీబీవీ పాఠశాల స్టాఫ్ నర్స్ సంతోష,ఆశలు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి -విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

**ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆర్డిఓ కార్యాలయం ముట్టడి..**






**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
నియోజకవర్గంలో పాలిటెక్నిక్ విద్యను కాపాడాలని, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ,ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి షాద్ నగర్ ఆర్డిఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఆందోళన కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు విద్యార్థులను అక్కడి నుంచి తరలించారు. అనంతరం ఆర్డిఓ స్వయంగా విద్యార్థుల వద్దకు వచ్చి వారి సమస్యలను విన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి,ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఎలాంటి నిర్ణయాలను విద్యార్థి సంఘాలు అంగీకరించబోవని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాలని,విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలని డిమాండ్ చేశారు.

పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించే వరకు విద్యార్థుల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాలిటెక్నిక్ విద్యార్థి, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ మావోయిస్టు కామ్రేడ్ కుంటోల్ల జంగయ్య సేవలు చిరస్మరణీయం

**నేరెళ్ల చెరువులో అతని జ్ఞాపకాలు పదిలం.. - జంగయ్య కు గ్రామస్తుల ఘన నివాళి..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నిరుపేద ప్రజల తరఫున పోరాడే కామ్రేడ్ గా జంగయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని ఫరూక్ నగర్ మండలం నేరెళ్ల చెరువు గ్రామస్తులు కొనియాడారు. కామ్రేడ్ కుంటొళ్ల జంగయ్య అలియాస్ రవి, దివాకర్ కమ్యూనిస్టు మావోయిస్ట్ నాయకుడిగా నిరుపేదలకు అండగా నిలిచిన జంగయ్యను 2005లో కల్వకుర్తి పరిధిలో అక్కడి పోలీసులు చిత్రహింసలకు గురిచేసి ఎన్ కౌంటర్ పేరిట హతమార్చారని అతని తల్లి పేర్కొన్నారు. నిరుపేదలకు అండగా నిలిచి 35 సంవత్సరాల వయసులోనే దివాకర్ కన్నుమూశారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ, రంగారెడ్డి జిల్లాల మావోయిస్ట్ కార్యదర్శిగా పనిచేసిన జంగయ్య ఫరూక్ నగర్ మండలం నేరేడ్ చర్ల గ్రామానికి చెందిన బుచ్చయ్య అయిదుగురు కుమారులలో ఒకరని గుర్తు చేశారు. ఒకటి నుంచి రెండు తరగతులు గ్రామంలో చదివిన ఆయన, నాలుగు నుంచి ఐదవ తరగతి వరకు సమీప బూర్గుల గ్రామంలో చదివారని అన్నారు. 6,7,8 బాలానగర్ లో చదివిన ఆయన 9,10 తరగతి గట్టులో చదివారన్నారు. సిటీ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేశారని గుర్తు చేశారు. కళాశాల సమయంలోనే రాడికల్స్ యూనియన్ లో సభ్యుడుగా చేరి ఉద్యమం మావోయిస్టుల వైపు ఆకర్షితుడయ్యారని అన్నారు. 1991నుంచి 99 మధ్యల వివిధ దళాలలో ఆయన పని చేశారని పేర్కొన్నారు. పీపుల్స్ వార్ పార్టీలో జంట నగరాల కార్యదర్శులుగా కూడా ఆయన పని చేశారన్నారు. 1999 నుంచి 2002 వరకు గిరాయిపల్లి కమాండర్ గా కూడా ఆయన కొనసాగారని గుర్తు చేసుకున్నారు. 2005లో ఆయన అమరుడు అయ్యే వరకు కూడా నిరుపేదల పక్షాన ప్రాణాలకు తెగించి పోరాడారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నేరెళ్లపల్లిలో ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఇటీవల ఇతని భార్య భారతమ్మ కగార్ ఆపరేషన్లో భాగంగా కేంద్రం ఎదుట వెళ్ళిపోయారు.

# తక్కువ పెట్టుబడితో సొంత భూమి కల నెరవేర్చుకునే సువర్ణావకాశం

**గోల్డెన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో అందుబాటు ధరల్లో ఫార్మ్ ల్యాండ్ ప్రాజెక్టులు**



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** సొంత స్థలం ఉండాలనే కలను ప్రతి సామాన్య కుటుంబం సాకారం చేసుకునేలా గోల్డెన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అందుబాటు ధరల్లో ఫార్మ్ ల్యాండ్ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొస్తోంది. వ్యవసాయ భూములను అభివృద్ధి చేసి, ఫార్మ్ ల్యాండ్ ప్లాట్లుగా రూపొందిస్తూ ప్రకృతి, పెట్టుబడి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టులను చేపడుతున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.డి. జె.చెన్న కేశవులు తెలిపారు. 15 సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో అనుభవంతో నాణ్యత, పారదర్శకత, కస్టమర్ సంతృప్తికి ప్రాధాన్యత ఇస్తూ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం జనగామలోని మాధారం, నిడికొండ ప్రాంతాలతో పాటు నారాయణఖేడ్, షాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రూ. 2 లక్షల నుంచే పెట్టుబడికి అవకాశం. మధ్య తరగతి, సామాన్య కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఒక గుంట స్థలం రూ. 2 లక్షల నుంచే ప్రారంభమవుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అలాగే 121చదరపు గజాల ఫార్మ్ ల్యాండ్ రూ. 3 లక్షల నుంచి అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో భూమిని సొంతం చేసుకుని భవిష్యత్‌లో పిల్లల విద్య, కుటుంబ అవసరాలు, ఆర్థిక భద్రతకు ఉపయోగపడేలా పెట్టుబడి పెట్టవచ్చని సూచించారు. ప్రకృతితో అనుబంధం ఫార్మ్ ల్యాండ్ ప్రత్యేకత ఈ ప్రాజెక్టుల్లో ఇప్పటికే మామిడి, జామ తదితర చెట్లు ఉన్నాయని,ఎర్ర నేలతో కూడిన భూములకు ప్రాధాన్యత ఇస్తున్నామని సంస్థ తెలిపింది. ఉదాహరణకు 121 చదరపు గజాల స్థలంలో మామిడి,జామ చెట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొంది. ప్రకృతి వాతావరణంలో భవిష్యత్‌లో ఫార్మ్ హౌస్ నిర్మించుకోవాలనుకునే వారికి కూడా ఈ ప్రాజెక్టులు అనుకూలంగా ఉంటాయని తెలిపింది. ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి కేవలం స్థలాల విక్రయానికే పరిమితం కాకుండా, ప్రాజెక్టుల్లో నివాసానికి అవసరమైన మౌలిక వసతులతో పాటు క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ తదితర సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల అభివృద్ధిని సంబంధిత నిబంధనలు, అనుమతులు, వర్తించే డీటీసీపీ ప్రమాణాలకు అనుగుణంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. గోల్డెన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ను ఈ నంబర్ కు 77024 30519 సంప్రదించాలని తెలిపారు:

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు 27న జరిగే మహాధర్నా ను విజయవంతం చేయాలని కోరిన రంగారెడ్డి జిల్లా టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కె. రామారావు శ్రీనేష్ కుమార్ నోరి.




**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**టీఎన్జీవోస్ ' అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు డాక్టర్ కె రామారావు శ్రీనేష్ కుమార్ నోరి నేతృత్వం లో కార్యవర్గ సమావేశం ఈరోజు కొంగరకలాన్‌లోని ఐ డి ఓ సి లో పలు కీలక అంశాలను చర్చించి, క్రింది కార్యక్రమాలు ఏకగ్రీవంగా నిర్ణయించింది:
టీజీఈఎస్ తీసుకున్న నిర్ణయాలు,పి అర్ సి ని వెంటనే ప్రకటించాలి,డి ఎ లను వెంటనే ప్రకటించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలి,ఒ పి ఎస్ ను పునరుద్దరించాలి,ఈ హెచ్ ఎస్ ను సమర్థవంతం గా అమలు చేయాలని కోరుతూ తీసుకున్న నిర్ణయాలకు మద్దతు ప్రకటించి ఈ క్రింది కార్యక్రమాలను విజయవంతం చేయాలనీ కోరారు.

**27 ఆగస్టు 2026: ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా/ప్రదర్శన.**
**1 సెప్టెంబర్ 2026: సీపీస్ కు వ్యతిరేకంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా.**
**10 సెప్టెంబర్ 2026: చలో హైదరాబాద్ కార్యక్రమం.**

ఈకార్యక్రమాలకు రంగారెడ్డి జిల్లా నుండి ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందిస్తూ,అధిక సంఖ్యలో పాల్గొనాలని సభ్యులను కోరారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీమతి డా. కిరణ్మయి, ఐఏఎస్ ని కలిసి, హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఈనెల 27వ తారీకున మహా ధర్నా కార్యక్రమానికి సంబంధించి సమాచార పత్రాన్ని అందచేశారు.
ఈ కార్యక్రమంలో నూతనకంటి వెంకట్, అసోసియేట్ ప్రెసిడెంట్, నర్సిరెడ్డి,వైస్ ప్రెసిడెంట్,శ్రీమతి శాంతిశ్రీ,వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ నాగేశ్వర్ రావు, రాకేష్,శ్రీమతి మహేశ్వరి, శ్రీమతి జ్యోత్స్న, డా.నరేందర్,శ్రీనివాస్, మహేష్, తదితరులు పాల్గొని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం వారి న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం మనమందరం ఐక్యంగా, సమష్టిగా పనిచేద్దాం అని పేర్కొన్నారు.

## నాగోల్ పోచమ్మ దేవాలయం డైరెక్టర్ గా ఆర్.చంద్రమోహన్ గౌడ్..



**నాగోల్,(ప్రజావినికిడి):**నాగోల్ గ్రామ దేవతలైన పోచమ్మ, మహంకాళి అమ్మవార్ల నూతన నిర్మాణ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యములో భాగంగా గ్రామ పెద్దలు నిర్ణయించిన గ్రామ పోచమ్మ తల్లి దేవాలయానికి రాగిరి.చంద్రమోహన్ గౌడ్ కు డైరెక్టర్లుగా అవకాశం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,నాకు ఈ అవకాశం ఇచ్చిననాగోల్ సీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ మరియు మాజీ ఎమ్మెల్సీ వై.మల్లేశం వారికి,పోచమ్మ దేవస్థానం అధ్యక్షుడు చింతల సురేందర్ నాథ్ యాదవ్, ఉపాధ్యక్షులు అనంతల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి చెరుకు చిరంజీవి గౌడ్, సంయుక్త కార్యదర్శి వస్పరి మల్లేష్ కురుమ, కోశాధికారి కోలన్ చంద్రశేఖర్ ఆజాద్,అదేవిదంగా మహంకాళి దేవాలయ కమిటీ సభ్యులకు,నాగోల్ గ్రామ పెద్దలకు,అన్ని కులాల వారికి వారు,వారి కుటుంబ సభ్యులు పేరుపేరునాప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాగిరి.చంద్రమోహన్ గౌడ్,మాట్లాడుతూ,నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని దేవాలయ అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తానని,నిష్టతో నిబంధనలతో ఐక్యమత్యంతో,ఆ భగవంతుని ఆశీస్సులతో త్రికరణశుద్ధిగా పనిచేస్తానని కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్లె సీత రాములు గౌడ్, చిత్తుల ప్రకాష్ గౌడ్,బీరప్ప, రావుల శ్రీనివాస్ గౌడ్,బద్దం రామకృష్ణ గౌడ్, బద్దం స్వతంత్ర గౌడ్,బద్దం శివశంకర్ గౌడ్, సతీష్ యాదవ్, రాగిరి కృష్ణమోహన్ గౌడ్,చిత్తుల మహేందర్ గౌడ్,శివ అన్న వినయ్ కుమార్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి,దివ్యాంగులకు న్యాయం చేయాలని ఎన్ డి ఒ పి-నెట్వర్క్ అఫ్ పర్సన్స్ విత్ దిశబిలిటీ ఆర్గనేస్సషన్స్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వికలాంగులకు సంబంధించి ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయాలని అన్నారు.ఈ సందర్బంగా క్యాంపు కార్యాలయంలో పలువురు వికలాంగులచే సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పలు అంశాలు ప్రస్తావనకు రావడం జరిగింది.ఎన్నికల హామీలు అమలు చేయాలి,వికలాంగులకు న్యాయం చేయాలని సుధీర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు వికలాంగులు పాల్గొన్నారు.

## అన్ని వయస్సుల వారికి ఫిజికల్ లిటరసీని అందించడమే లక్ష్యం..

### యువతతో పాటు చిన్నారులు, వృద్ధులు కూడా శారీరక చైతన్యాన్ని పెంపొందించుకోవాలి..

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
తెలంగాణలో అన్ని వయస్సుల ప్రజలకు 100 శాతం ఫిజికల్ లిటరసీ అందించడమే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (ౡజుూఖ) లక్ష్యమని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.కిషోర్ గోపీనాథన్ తెలిపారు.
జిల్లా స్థాయిలో ఫిజికల్ లిటరసీ కార్యక్రమం అమలుపై యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో, ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్ సహకారంతో శనివారం రాష్ట్ర స్థాయి వర్చువల్ ఓరియంటేషన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డా.కిరణ్మయి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డా.కిషోర్ గోపీనాథన్ మాట్లాడుతూ, ఫిజికల్ లిటరసీ అనేది కేవలం యువత క్రీడల్లో పాల్గొనేందుకు మాత్రమే ఉద్దేశించినది కాదని, చిన్నారులు, యువత, వృద్ధులు సహా అన్ని వయస్సుల వారు శారీరక చైతన్యాన్ని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకునేలా చేయడమే యూనివర్సిటీ లక్ష్యమని తెలిపారు.
ఆధునిక క్రీడలతో పాటు గ్రామస్థాయిలో సాంప్రదాయ క్రీడలను కూడా ప్రోత్సహించి, ప్రజల్లో శారీరక చైతన్యాన్ని పెంపొందించాలని సూచించారు. ఫిజికల్ లిటరసీని అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తృతం చేసేందుకు ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్‌తో




యూనివర్సిటీ భాగస్వామ్యం చేసుకుందని తెలిపారు.
ప్రతి జిల్లాలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారులు సమన్వయంతో అన్ని వయస్సుల ప్రజలకు ఫిజికల్ లిటరసీని చేరువ చేసేలా కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని వైస్ ఛాన్సలర్ సూచించారు. జిల్లా స్థాయి ఫిజికల్ లిటరసీ కోఆర్డినేటర్లు కీలక పాత్ర పోషిస్తూ జిల్లా కలెక్టర్, సామాజిక ప్రభావశీలులు, వివిధ ప్రచార కార్యక్రమాలతో సమన్వయం చేసుకోవాలని, అవసరమైన డేటాబేస్‌ను రూపొందించుకుని వనరుల వ్యక్తులుగా వ్యవహరించాలని తెలిపారు.ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్ గవర్నెన్స్ & హెచ్‌ఆర్ ప్రతినిధి అమిత్ మాలిక్ మాట్లాడుతూ ఇప్పటివరకు 50 దేశాల్లో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని స్వీకరించినట్లు తెలిపారు. ఫిజికల్ లిటరసీ



అనేది శరీరం, మనస్సు, హృదయం సమన్వయంతో కూడిన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ మూడు అంశాలే ప్రతి వ్యక్తి ఫిజికల్ లిటరసీ ప్రయాణానికి పునాదులని వివరించారు.
ఫిజికల్ లిటరసీ అనేది కేవలం యువతకు సంబంధించిన క్రీడా కార్యకలాపం కాదని,అన్ని వయస్సుల వారు ప్రతిరోజూ చురుకుగా ఉండి తమ శారీరక దృఢత్వాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన జీవన విధానమని అమిత్ మాలిక్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి,శ్రీమతి ఎస్.స్వర్ణలత, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు,చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీమతి జి.శాంతి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో వారాహి సిల్క్స్ నూతన షోరూమ్ ఘనంగా ప్రారంభం

### ముఖ్య అతిథులుగా హాజరైన సినీ తారలు తేజ సజ్జ..,మీనాక్షి చౌదరి..

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): ఆగష్టు 22,**
వనస్థలిపురం: ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ 'వారాహి సిల్క్స్' తమ నూతన షోరూమ్‌ను వనస్థలిపురంలో అత్యంత వైభవంగా ప్రారంభించింది. ఈ వేడుకకు టాలీవుడ్ యువ కథానాయకుడు తేజ సజ్జ, కథానాయిక మీనాక్షి చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

**వివాహాలు, పండుగలకు సరికొత్త డిజైన్లు: సినీ నటుడు తేజ సజ్జ**
హీరో తేజ సజ్జ మాట్లాడుతూ, వనస్థలిపురంలో వారాహి సిల్క్స్ నూతన షోరూమ్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది.ఇక్కడ సాంప్రదాయ పట్టు చీరల నుంచి ఆధునిక ఫ్యాషన్ దుస్తుల వరకు అద్భుతమైన కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. వివాహాలు, శుభకార్యాలు, పండుగలకు సరిపడే సరికొత్త డిజైన్లు ఒకే చోట లభించడం ఇక్కడి ప్రజలకు ఎంతో సౌకర్యంగా




ఉంటుంది.సంస్థ యాజమాన్యానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని పేర్కొన్నారు.

**మహిళల మనసు దోచే కలెక్షన్స్ :సినీ నటి మీనాక్షి చౌదరి**
హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, వారాహి సిల్క్స్ కలెక్షన్ చూసి నేను ఎంతగానో ముగ్ధురాలినయ్యాను. మహిళల అభిరుచికి తగ్గట్లుగా కాంచీపురం, బనారసి వంటి సంప్రదాయ పట్టు చీరలతో పాటు ట్రెండీ డిజైన్లు కూడా చాలా బాగున్నాయి. నాణ్యత, సరసమైన ధరలతో పాటు వినియోగదారులకు ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని అందించేలా ఈ షోరూమ్‌ను తీర్చిదిద్దారు. వారాహి సిల్క్స్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.సినీ తారల రాకతో షోరూమ్ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదు


### భూభారతి సదస్సులు, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు

### రూ.230కే సిమెంట్ బ్యాగ్.. పేదల సొంతింటి కల సాకారం

### నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు స్థల పరిశీలన

### ఉమ్మడి నిజామాబాద్ లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన




**నిజామాబాద్,ఆగస్టు 22: (ప్రజావినికిడి):** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం నాడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి గారు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారం లో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఃూష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. 43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ, నూతన గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర పక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో పేదలకు తగిన స్థాయిలో ఇళ్లు నిర్మించలేదని విమర్శించిన మంత్రి, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై..

## ప్రైవేట్ రంగానికి కీలక బాధ్యతలు!

**ఆగస్టు 22(ప్రజావినికిడి):**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై లాంచ్ వెహికల్స్ తయారీ, సాధారణ శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించనుంది. ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి, శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యేక మిషన్లపై మరింత దృష్టి పెట్టనుంది. బిజినెస్ టుడే నిర్వహించిన ఇండియా ఏ 100 ఎకానమీ సమ్మిట్‌లో ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు. "ఇస్రో ఇకపై ఎలాంటి లాంచ్ వెహికల్స్‌ను తయారు చేయదు. వాటి తయారీని ప్రైవేట్ రంగం లేదా ప్రభుత్వ రంగ సంస్థలు చేపడతాయి" అని ఆయన తెలిపారు. ఈ మార్పు ఇప్పటికే ప్రారంభమైంది. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు బదిలీ చేశారు. తదుపరి దశలో భారత్ ప్రధాన రాకెట్లైన పీఎస్ఎల్‌వీ (పీఎస్ఎల్‌వీ), ఎల్‌వీఎం-3 (ఎల్‌వీఎం3) సాంకేతికత, తయారీ కూడా ప్రైవేట్ రంగానికి బదిలీ




చేసే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లు గోయెంకా తెలిపారు.
ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధానంగా పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. కొత్త సాంకేతికతలు, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించనుంది.
ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేందుకు సిద్ధమైన తర్వాత దానిని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా చెప్పారు.
ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు.
ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త లాంచ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన ఆపరేటర్‌ను వచ్చే నాలుగు లేదా ఐదు నెలల్లో ఖరారు చేసే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు.
భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతం ఉన్న సుమారు 8 బిలియన్ డాలర్ల నుంచి 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వ డిమాండ్, అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాల్లో విస్తృతంగా వినియోగించడం, అంతర్జాతీయ మార్కెట్లలో భారత సంస్థల విస్తరణ కీలకమని గోయెంకా చెప్పారు.
ప్రభుత్వం ప్రధాన కస్టమర్‌గా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ ఇప్పటికే ప్రైవేట్ సంస్థలకు 31 ఉపగ్రహాల తయారీకి ఆర్డర్ ఇచ్చిందని, ఇదే విస్తృత కార్యక్రమంలో భాగంగా మరో 21 ఉపగ్రహాలను ఇస్రో తయారు చేయనుందని తెలిపారు.

# నాభర్తను విడిచి పెట్టండి

## బ్రిటన్‌కు భారతీయ నావికుడి భార్య వినతి

**న్యూఢిల్లీ,ఆగస్టు 22 (ప్రజావినికిడి):**
రష్యా 'షాడో ఫ్లీట్'కు చెందినదిగా అనుమానిస్తున్న చమురు ట్యాంకర్‌పై ఇటీవల బ్రిటన్ దళాలు దాడి చేసి.. ఓ భారతీయుడిని అరెస్ట్ చేశాయి. ఈ ఘటనపై ఆ భారత నావికుడి భార్య మాట్లాడుతూ.. తన భర్తను బలిపశువును చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కేవలం తన యజమాని ఆదేశాలను మాత్రమే పాటించారని చెప్పారు. సదరు నౌక ఇంగ్లిష్ ఛానల్ మీదుగా ప్రయాణిస్తుండగా.. బ్రిటన్ కమాండోలు అందులోకి ప్రవేశించారు. నౌక కెప్టెన్‌గా ఉన్న 38ఏళ్ల అజయ్ పంత్‌ను అరెస్ట్ చేశారు. ఇటీవల అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసులో అతడు గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్షను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అజయ్ భార్య రితూ పంత్ మీడియాతో మాట్లాడుతూ.. 'నౌక యజమాని వద్ద నా భర్త కేవలం ఓ ఉద్యోగి మాత్రమే. యాజమాన్యం ఎలా చెబితే అలాగే చేశారు. తాను చేసిన తప్పేంటో కూడా అర్థం కావట్లేదని ఆయన వాపోతున్నారు. చేయని తప్పునకు జైల్లో కుమిలిపోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నౌకలో 98వేల టన్నుల చమురును అక్రమంగా రవాణా చేస్తున్నారన్నది బ్రిటన్ ఆరోపణ. నౌక కెప్టెన్‌గా కార్గోలో ఏముందో అజయ్ పంత్‌కు కచ్చితంగా తెలుసునని బ్రిటిష్ ప్రాసిక్యూషన్ కోర్టులో వాదించింది. అయితే, దీన్ని అజయ్ న్యాయవాది తోసిపుచ్చారు. కెప్టెన్ బాధ్యత కేవలం నౌకలోని కార్గోను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమేనని, అందులో ఏముందో వారికి తెలిసే అవకాశం లేదని అన్నారు. ఈ కేసుపై డిసెంబరు 15 నుంచి విచారణ జరగనుంది. మరోవైపు, కాన్సులార్ అనుమతితో బ్రిటన్ జైల్లో ఉన్న అజయ్ పంత్‌ను భారత విదేశాంగ శాఖ కలిసి ఘటన గురించి తెలుసుకుంది. జూన్ 14న ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కామెరూన్ జెండాతో ఉన్న చమురు ట్యాంకర్ 'స్మిట్రోస్'.. ఇంగ్లిష్ ఛానల్‌లో ప్రయాణిస్తున్న సమయంలో బ్రిటన్ సైనిక దళాలు అందులోకి ప్రవేశించాయి. 6 గంటలపాటు సాగిన ఈ ఆపరేషన్‌లో బ్రిటన్ రాయల్ మెరైన్ కమాండోలు, ఎన్‌సీఏ అధికారులు పాల్గొన్నారు. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉండగా.. కెప్టెన్‌గా ఉన్న అజయ్‌ను బ్రిటన్ దళాలు అరెస్ట్ చేశాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు.. రష్యా వందల సంఖ్యలో నౌకలను వివిధ దేశాల జెండాలతో నడుపుతోంది. ఈ 'షాడో ఫ్లీట్'లో భాగంగానే ఈ ట్యాంకర్ రష్యా నుంచి చమురు రవాణా చేస్తోందని బ్రిటన్ ఆరోపించింది. జూన్ 5న ఇది రష్యా పోర్టు నుంచి ఈజిప్టునకు బయల్దేరిందని పేర్కొంది. ప్రస్తుతం ఈ నౌక ఇంగ్లాండ్ దక్షిణ తీరంలో ఓ సురక్షిత స్థానంలో ఉంది.

# తక్కువ పెట్టుబడి, లక్షల్లో ఆదాయం..

## మహిళల కోసం ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 'చాయ్ రాస్తా' పథకం

**ఆగస్టు 22 (ప్రజావినికిడి):**
ఏపీలో మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త' అనే నినాదాన్ని నిజం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మహిళలు తక్కువ పెట్టుబడితో గౌరవప్రదమైన ఆదాయం సంపాదించేందుకు 'చాయ్ రాస్తా' పేరుతో సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. డీఆర్‌డీఏ-సెర్ప్ ఆధ్వర్యంలో ఈ పథకం అమలు కానుండగా, తొలి దశలో అనంతపురం జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది.

**ఏమిటీ 'చాయ్ రాస్తా' పథకం?**
రాష్ట్రంలోని మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం డీఆర్‌డీఏ-సెర్ప్, 'చాయ్ రాస్తా' అనే బ్రాండ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పథకం కింద ఎంపికైన మహిళలకు ఫ్రాంచైజ్ పద్ధతిలో ఆధునిక టీ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. కేవలం టీ, కాఫీ అమ్మడమే కాకుండా బిస్కెట్లు, కూల్ డ్రింక్స్ వంటి ఇతర చిరుతిళ్లను కూడా విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ ఫ్రాంచైజ్ తీసుకున్న వారికి వ్యాపారం కోసం అవసరమైన కంటైనర్, ప్రాథమిక సరుకులు, ఇతర సామగ్రిని అందిస్తారు. అంతేగాక వ్యాపారానికి అత్యంత కీలకమైన లొకేషన్ సర్వే, అవసరమైన లైసెన్సులు, డాక్యుమెంటేషన్, మార్కెటింగ్, వ్యాపార నిర్వహణలో శిక్షణ వంటి అన్ని విషయాల్లోనూ సంస్థ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది.

**ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూత**
చాయ్ రాస్తా ఏర్పాటుకు ఆసక్తి చూపే మహిళలకు




ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. డీఆర్‌డీఏ ద్వారా స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ వంటి పథకాల కింద ఒక్కో యూనిట్‌కు రూ.4 లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. దీనికి అదనంగా, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద రూ.4 లక్షల రుణం పొందితే, రూ.1.40 లక్షల వరకు రాయితీ (సబ్సిడీ) పొందే అద్భుతమైన అవకాశం కూడా కల్పించారు. దీనివల్ల లబ్ధిదారులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుంది.

**ఆదాయం అంచనాలు.. అనంతలో ప్రారంభం**
ఈ టీ స్టాల్స్ ఏర్పాటు చేసే ప్రాంతం, రద్దీని బట్టి ఆదాయం ఆధారపడి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సగటున రోజుకు రూ.5,000 వ్యాపారం జరిగితే, అన్ని ఖర్చులు పోగా నెలకు రూ.40,000 వరకు నికర ఆదాయం వస్తుంది. అదే రోజుకు రూ.10,000 వ్యాపారం జరిగితే నెలకు రూ.లక్ష, రోజుకు రూ.20,000 వ్యాపారం జరిగితే నెలకు రూ.2.50 లక్షల వరకు ఆదాయం సంపాదించే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.
ప్రస్తుతం అనంతపురం జిల్లాలో ఈ పథకం అమలుకు లైన్ క్లియర్ అయింది. జిల్లావ్యాప్తంగా తొలి విడతలో 30 అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, టోల్‌గేట్లు, పుణ్యక్షేత్రాలు, బస్టాండ్లు వంటి జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఈ స్టాల్స్ ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో సర్వే నిర్వహించి, మరిన్ని ప్రాంతాల్లో 'చాయ్ రాస్తా' యూనిట్లను విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# 19 రోజులైనా ఆచూకీ లేని మత్స్యకారులు

## ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు

**విశాఖపట్టణం,ఆగస్టు 22(ప్రజావినికిడి):**
కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు జెట్టీ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల బోటు గత 19 రోజులుగా కనిపించకుండాపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నెల 3న వేటకు బయలుదేరిన ఈ బోటుతో 5వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో కమ్యూనికేషన్ తెగిపోయింది. సాధారణంగా వేటకు వెళ్లినవారు తిరిగొస్తారనే నమ్మకంతో కుటుంబసభ్యులు ఈ నెల 13వ తేదీ వరకు వేచి చూశారు. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆందోళనకు గురై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 17వ తేదీ నుంచి బాధితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ గాలింపు చర్యల్లో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న నాలుగు కోస్ట్ గార్డ్ నౌకలతో పాటు రెండు నేవీ హెలికాప్టర్లు బంగాళాఖాతంలో తీవ్రంగా శోధిస్తున్నాయి. విశాఖపట్నం, చెన్నై నుంచి వచ్చిన నేవీ నౌకలు సముద్రంలో అత్యంత లోతైన ప్రాంతాల్లో అన్వేషణ కొనసాగిస్తున్నాయి. కాకినాడ, విశాఖ కోస్ట్ గార్డ్ బృందాలు, మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో నేడు ఐదో రోజు కూడా గాలింపు ప్రక్రియను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు పోలీసులు బాధితుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరించి, వారి కాల్ డేటాను విశ్లేషిస్తూ సాంకేతిక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, సదరు బోటులో ముందస్తు జాగ్రత్తగా ఊ÷ఎఈ ట్రాన్స్‌పాండర్ పరికరాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్లే కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయి, వారి లొకేషన్‌ను గుర్తించడం కష్టతరంగా మారింది. మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు తీవ్ర భయాందోళనలతో ఎదురుచూస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను రాజమండ్రి ప్రతినిధి శ్రీనివాస్ త్వరలోనే అందించనున్నారు.

-----

# హర్మూజ్‌పై ట్రంప్ కొత్త మెలిక

## ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు

**వాషింగ్టన్,ఆగస్టు 22(ప్రజావినికిడి):** పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసాయి తారా స్థాయికి చేరేలా ఉన్నాయి. హర్మూజ్ జలసంధి విషయంలో ఇరుదేశాలు పట్టువీడకపోవడమే అందుకు కారణం. హర్మూజ్‌ను తమ భూభాగంగా ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌పై ఆర్థికపరమైన ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. అయినా సరే ఇరాన్ మాత్రం వెరవడం లేదు. మరోసారి తమను భయపెట్టాలని చూస్తే విధ్వంసకరంగా బదులిస్తామని పేర్కొంది టెహ్రాన్. ఆరు నెలలకు పైగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభాం చూపిస్తోంది ఇరాన్ ? ఇజ్రాయేల్ ? అమెరికా యుద్ధం. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడం.. అమెరికా మాత్రం ఆ జలసంధిని తమ భూభాగంగా ప్రకటించడం తాజాగా మరింత ఉద్రిక్తతలకు ఆజ్యం పోశాయి.

# రూపాయి బియ్యంతో దళారుల దందా

**ఆగస్టు 22(ప్రజావినికిడి):**
ఉచిత రూపాయికే కిలో బియ్యం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పక్కదారి పడుతోంది. బియ్యం స్మార్ట్ కార్డులు అందచేసినా, చాలావరకు బియ్యం అక్కమంగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టన్నుల కొద్ది బియ్యం పోర్టులు దాటిపోయాయి. తెలంగాణలో కూడా అదే విధంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలించి నయాదందా తెరతీసారు. ఎన్టీఆర్ హాయంలో పేదలకు బియ్యం అందించాలని కిలో రెండు రూపాయలకే పథకం తెచ్చారు. అది పలు రూపాంతరాలు చెంది. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉండగా కిలో రూపాయికే అందిస్తున్నారు. దీని ధరలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్నాయి. ఎక్కడ ఓటు బ్యాంక్ పోతుందో అన్న భయంలో పాలకులు ఉన్నారు. పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వాలు రూపాయి ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా బియ్యం ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లబ్ది అక్రమార్కుల పాలిట 'కాసుల పంట'గా మారుతోంది. రూపాయి లేకపోయినా పేదవాడు ఆకలితో అలమటించకూడదని ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుంటే, ఆ పథకం ఆశయం కాస్తా దారి మళ్లుతోంది. ఉచిత బియ్యం అర్హులైన పేదల కడుపు నింపాల్సింది పోయి, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతుండటం తీవ్ర విచారకరం. తినడానికి ఇచ్చే బియ్యం.. గడప దాటక ముందే విక్రయం జరుగుతోంది. వందలకోటల బిసినెస్ దీనివెనక నడుస్తోంది. ఈ రోజుల్లో చాలా చోట్ల రేషన్ కార్డు ఉండి, రేషన్ బియ్యాన్ని ఆహారంగా వాడుకోని వర్గాలు దాన్ని ఒక అదనపు ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నాయి. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే లబ్దిదారుల ఇళ్ల ముందే దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు, కేవలం ఐదు-పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల దందా ఇంకొంచెం ముందుకెళ్లింది. అసలు బియ్యం సంచులను ఇళ్లకు కూడా తీసుకెళ్లడం లేదు. షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి, బియ్యాన్ని అక్కడ వదిలేసి, కిలోకు రూ.10 నుండి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విధంగా మిగిలిపోయిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంకొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా.. బహిరంగ మార్కెట్లో వీటిని కేజీకి రూ.20 నుండి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది. ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేసినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వం



ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల అధికారులు హెచ్చరించడం షరామామూలుగా మారింది. దీంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపడం లేదు. దీంతో వ్యారం యధావిధిగా సాగుతోంది. చ్చరించారు. లబ్దిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగస్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న ఆహార ధాన్యాలను కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ రాబోయే 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖను నేరుగా ప్రజల చెంతకు చేర్చాలనే తపనతోనే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు తరలించే దుస్థితి ఉండేదని, దానిని మారుస్తూ దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది పేదలు లబ్ది పొందుతున్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందక ఇబ్బంది పడిన వారికి ఉపశమనం కలిగిస్తూ.. ప్రభుత్వం కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత అందుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కూడా ఈ కార్డులు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వాలు కఠిన చర్యలు తసీఉకోనంత వరకు ఈ దందా ఆగదు. అక్రమంగా తరలింపు కూడా ఆతదని పాలకులు గుర్తించాలి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ట్రీసా-గాయత్రి జోడీకి చారిత్రక కాంస్యం!



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్లు ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ జోడీ అద్భుత ప్రదర్శనతో కాంస్య పతకం కైవసం చేసుకుంది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ చైనా ద్వయం లియు షెంగ్ షు, టాన్ నింగ్ చేతిలో పోరాడి ఓటమి పాలైనా, టోర్నీలో సగర్వంగా కాంస్యంతో సరిపెట్టుకుంది. గంటా 11 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ సెమీస్ పోరులో భారత జోడీ 21-18, 13-21, 8-21 తేడాతో పరాజయం చవిచూసింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఈ యువ ద్వయానికి ఇదే తొలి పతకం కావడం విశేషం. ముఖ్యంగా 2011లో గుత్తా జ్వాలా, అశ్విని పొన్నప్ప జోడీ లండన్‌లో కాంస్యం సాధించిన తర్వాత, మళ్లీ మహిళల డబుల్స్‌లో భారత్‌కు పతకం రావడం ఇదే తొలిసారి. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన ఈ జంట టోర్నీ ఆసాంతం అద్భుత ఆటతీరు కనబరిచి క్రీడాభిమానుల మన్ననలు పొందింది. సెమీస్ పోరులో భారత జంట ఉత్సాహంగా మ్యాచ్ ప్రారంభించింది. ఆరంభంలోనే 7-2 ఆధిక్యంలోకి వెళ్లినా, చైనా జోడీ పుంజుకుని విరామానికి 11-7 ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత ట్రీసా, గాయత్రి అద్భుతంగా ఆడి స్కోరును 12-12 వద్ద సమం చేశారు. సుదీర్ఘ ర్యాలీలతో పాటు క్రాస్ కోర్ట్ షాట్లతో చెలరేగి తొలి గేమ్‌ను 21-18తో కైవసం చేసుకున్నారు. కానీ రెండో గేమ్‌లో చైనా జంట వ్యూహం మార్చింది. భారత జోడీ అనవసర తప్పిదాలు చేయడంతో పాటు నెట్ వద్ద తడబడటంతో చైనా ఆధిపత్యం ప్రదర్శించింది. కంటిన్యూగా పాయింట్లు సాధిస్తూ 21-13తో రెండో గేమ్‌ను గెలుచుకుంది. ఇక కీలకమైన మూడో గేమ్‌లో చైనా జోడీ పూర్తి స్థాయి ఆధిపత్యం చెలాయించింది. ఆరంభంలో 2-2 తో స్కోరు సమంగా ఉన్నా, ఆ తర్వాత చైనా క్రీడాకారిణులు ఆట వేగాన్ని పెంచారు. ట్రీసాను టార్గెట్ చేస్తూ వరుస పాయింట్లు రాబట్టి విరామ సమయానికి 11-5 తో భారీ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. తొలి గేమ్‌లో చూపించిన దూకుడును భారత జోడీ పునరావృతం చేయలేకపోయింది. వరుసగా చేసిన తప్పులు చైనాకు కలిసొచ్చాయి. చివరకు ఏ దశలోనూ కోలుకోలేకపోయిన ట్రీసా, గాయత్రి జంట 8-21 తో మూడో గేమ్‌ను చేజార్చుకుంది. ఓడినా కాంస్య పతకంతో ఈ జోడీ చరిత్ర సృష్టించింది.

# బౌలింగ్ కూర్పుపై టీమ్ మేనేజ్మెంట్ కసరత్తు



శ్రీలంకతో కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్ కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ ఎంపికపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ సారాంశ్ జైన్‌ను తీసుకోవాలా వద్దా అనే నిర్ణయం పూర్తిగా పిచ్ స్వభావంపైనే ఆధారపడి ఉంటుందని శ్రీలంక మాజీ క్రికెటర్ రస్సెల్ ఆర్నాల్డ్ వ్యాఖ్యానించాడు. గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టులో ఇండియా 165 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కుల్దీప్ కేవలం ఒక వికెట్ మాత్రమే దక్కించుకున్నాడు. కుల్దీప్ స్థానంలో జట్టులోకి వస్తే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 181 వికెట్లు, 2,223 రన్స్ చేసిన ఇండోర్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌కు ఇది డెబ్యూ మ్యాచ్ అవుతుండటం విశేషం.శ్రీలంక జట్టులో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు రాణిస్తున్న నేపథ్యంలో ఆఫ్ స్పిన్నర్‌ను తీసుకోవడం లాజిక్కే అయినా, ప్రాక్టీస్ సెషన్ తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆర్నాల్డ్ తెలిపాడు. పిచ్ పొడిగా ఉండి ఆది నుంచే టర్న్ అయ్యే అవకాశం ఉంటే సారాంశ్ జైన్ బెస్ట్ ఆప్షన్ అవుతాడని వ్యాఖ్యానించాడు. ఒకవేళ పిచ్ ఫ్లాట్‌గా ఉండి ఆట సాగుతున్న కొద్దీ నెమ్మదిస్తే మాత్రం ప్రత్యర్థిని బోల్తా కొట్టించడానికి కుల్దీప్ యాదవ్ నైపుణ్యం అవసరమని తెలిపాడు. మరోవైపు శ్రీలంక జట్టు టాప్ ఆర్డర్ వైఫల్యాలతో కొట్టుమిట్టాడుతోంది. గాలే టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి లంక చేతులెత్తేసింది. పాథుమ్ నిస్సాంక, కుసాల్ మెండిస్ గాయాలతో దూరం కాగా, దినేష్ చండిమల్ సైతం కంకషన్ కారణంగా కొలంబో మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. టెస్ట్ ఆడే అన్ని దేశాల్లో శ్రీలంక ఓపెనింగ్ భాగస్వామ్యాలు అత్యంత పేలవంగా ఉన్నాయని ఆర్నాల్డ్ గుర్తు చేశాడు. కొత్త బంతి గట్టిగా ఉన్నప్పుడు అనవసర దూకుడు ప్రదర్శించి వికెట్లు సమర్పించుకున్నారని, కామిందు మెండిస్ లాంటి అనుభవజ్ఞుడు కూడా అదే తప్పు చేశాడని నిట్టూర్చాడు. బంతి పాతబడే వరకు క్రీజులో నిలబడితే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుందని గుర్తు చేశాడు. కొలంబో మ్యాచ్ కోసం శ్రీలంక జట్టులోనూ మార్పులు ఉండవచ్చని ఆర్నాల్డ్ వ్యాఖ్యానించాడు. ఫాస్ట్ బౌలర్ లాహిరు కుమారను పక్కన పెట్టి ఆఫ్ స్పిన్నర్ రమేష్ మెండిస్‌ను తుది జట్టులోకి తీసుకునే చాన్స్ ఉందని పేర్కొన్నాడు. ఇద్దరు స్పిన్నర్లు చిన్న స్పెల్స్ వేస్తే మరింత తాజాగా, శక్తితో బౌలింగ్ చేయగలుగుతారని ఆర్నాల్డ్ తెలిపాడు. బ్యాటర్లను గాల్లోనే బోల్తా కొట్టించాలంటే పూర్తి ఫిట్‌నెస్‌తో బౌలింగ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. ఇక రెండో టెస్టు ఆదివారం నుంచి కొలంబో వేదికగా ప్రారంభం కానుంది.

# గాలే తరహాలోనే సమతుల్య పిచ్ సిద్ధం !

ఇండియన్ బ్యాటర్ల స్పిన్ బలహీనతను టార్గెట్ చేస్తూ డస్ట్‌బౌల్ పిచ్ రెడీ చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ, కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగే రెండో టెస్టుకు గాలే తరహా బ్యాలెన్స్‌డ్ ట్రాక్ సిద్ధం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని సమాచారం. తొలి టెస్టులో ఇండియా 165 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో ఐదు రోజుల పాటు పిచ్ సహజ సిద్ధమైన మార్పులతో బ్యాటర్లు, బౌలర్లకు సమాన అవకాశాలు ఇచ్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆగస్టు 23 నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టుకు మితిమీరిన స్పిన్ పిచ్ తయారు చేస్తే అది లంక జట్టుకే రివర్స్ అయ్యే ప్రమాదం ఉందని శ్రీలంక క్రికెట్ బోర్డు అనుమానిస్తోంది. దినేష్ చండిమల్, కుసాల్ మెండిస్, పాథుమ్ నిస్సాంక లాంటి సీనియర్ల గైర్హాజరీలో యువ బ్యాటర్లకు అవకాశం ఇవ్వడానికి గాలే తరహా సమతుల్య పిచ్ సరైనదని లంక బోర్డు వర్గాలు భావిస్తున్నాయి. 1999 నుంచి 2009 మధ్య కాలంలో ఈ వేదికపై శ్రీలంక ఆడిన 12 టెస్టుల్లో ఆరు విజయాలు సాధించి మిగిలినవి డ్రా చేసుకుని చక్కని ప్రతిభ కనబర్చింది.. కుమార్ సంగక్కర, మహేల జయవర్ధనే భారీ స్కోర్లు సాధించగా, దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ ప్రత్యర్థులను ముప్పు తిప్పులు పెట్టేవాడు. సీనియర్ ఆటగాళ్లు రిటైర్ అయ్యాక ఇక్కడి పిచ్ స్వభావం పూర్తిగా మారిపోయిందని నిపుణులు



గుర్తు చేస్తున్నారు. తర్వాతి దశాబ్దంలో లంక ఇక్కడ ఆడిన ఏడు టెస్టుల్లో మూడింట్లో మాత్రమే గెలిచి, నాలుగింట్లో ఘోర పరాజయం పాలైంది.

రెండు సార్లు ఇండియా, పాకిస్తాన్ జట్లకు 400 కంటే ఎక్కువ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సమర్పించుకుని, ఓటమి పాలైంది. సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ లాంటి జట్లపై మాత్రమే లంక ఇక్కడ విజయాలు సాధించింది. సీనియర్ల శకం ముగిసిన తర్వాత ఇండియా, ఇంగ్లాండ్, పాకిస్తాన్ జట్లు ఇక్కడ సులభంగా ఆధిపత్యం కనబర్చాయి. రాబోయే రెండో టెస్టులో కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యే ఛాన్స్ ఉందని నిపుణు లు జోస్యం చెబుతున్నారు. తొలుత బ్యాటింగ్ చేసే జట్టు మ్యాచ్ పై పట్టు సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది.

సిరీస్ డ్రా చేయాలనే పట్టుదలతో ఉన్న ఆతిథ్య జట్టు పిచ్ రూపకల్పనలో ఏ నిర్ణయం తీసుకుంటుందో అనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఈ మ్యాచ్ లో గెలిస్తే సిరీస్ సొంతం చేసుకోవడంతోపాటు, డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో మరింత ముందుకు పోతుంది టీమిండియా.

# సిరీస్ పట్టేస్తారా?

**● 2-0 విజయంపై భారత్ గురి ● సమంపై ఆతిథ్య శ్రీలంక ఆశలు ● నేటి నుంచి భారత్, శ్రీలంక రెండో టెస్టు ● ఉదయం 10 నుంచి సోనీస్పోర్ట్స్‌లో...**



**కొలంబో:** స్పిన్ సవాల్‌ను ఎదుర్కోవటంలో శుభ్‌మన్ సేన సఫలం అవుతుందా? అనే అనుమానాలతో మొదలైన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో.. గాలె టెస్టులో విజయంతో ఆ అనుమానాలకు భారత్ గట్టి సమాధానమే ఇచ్చింది. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడటంతో పాటు స్పిన్‌తో ప్రత్యర్థిని మాయ చేయటంలో భారత్ విజయవంతమైంది. ఆరంభంలో పేస్, ఆఖర్లో స్పిన్‌కు సహకరించే కొలంబోలో భారత్, శ్రీలంక నేటి నుంచి రెండో టెస్టులో ఢీకొట్టనున్నాయి. స్పిన్నర్ల మాయాజాలంపై ఆతిథ్య లంకేయులు ఆశలు పెట్టుకోగా.. భారత్ సమిష్టి ప్రదర్శన పునరావృతం చేయాలనే ఆలోచనతో బరిలోకి దిగుతోంది. **కుల్‌దీప్‌కు అగ్ని పరీక్ష** చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ కెరీర్‌లో అగ్ని పరీక్ష ఎదుర్కొంటున్నాడు. గాలె టెస్టులో భారత స్పిన్ త్రయం మాయ చేసినా.. ముగ్గురు స్పిన్నర్లలో అంచనాలను అందుకోలేని స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఒక్కడే. ఒక్క వికెట్ మాత్రమే పడగొట్టిన కుల్‌దీప్ యాదవ్ మ్యాచ్లో బ్యాటర్లపై ఒత్తిడి పెంచలేదు. యువ స్పిన్నర్ మానవ్ సుతార్ వికెట్ల జాతర సాగించగా, సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా ఆశించిన మేరకు రాణించాడు. దీంతో తుది జట్టులో కుల్‌దీప్ యాదవ్ చోటు ప్రశ్నార్థకంగా మారింది. రెండో టెస్టుకు కుల్‌దీప్‌ను కొనసాగిస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది. కుల్‌దీప్ యాదవ్ ఫామ్ కోల్పోయాడా? జట్టు మేనేజ్‌మెంట్ అతడికి సరైన భరోసా ఇవ్వటం లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. తొలి టెస్టులో భారత్ సమిష్టిగా రాణించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఒక్కడే బ్యాటింగ్ ఆర్డర్‌లో నిరాశపరిచాడు. కెఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ మెప్పించగా.. దేవదత్ పడిక్కల్ అదరగొట్టాడు. రిషబ్ పంత్, ధ్రువ్ జురెల్‌లు కీలక అర్థ సెంచరీలు సాధించారు. బ్యాటర్లు ఇదే జోరు కొలంబోలోనూ కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదు. వికెట్ల వేట ప్రధానంగా స్పిన్నర్లు చూసుకోగా.. పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణలు చక్కటి సహకారం అందించారు. తొలి టెస్టులో ఆల్‌రౌండ్ షో చూపించిన భారత్ నేడు కొలంబోలో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. **సమం చేయాలని..** తొలి టెస్టులో ఓడినా, ఆతిథ్య జట్టు మరీ తీసికట్టుగా ఆడలేదు. సోనల్ దినుశ బ్యాట్‌తో గొప్పగా రాణించాడు. నిరోషన్ డిక్వెలా, ధనంజయ డిసిల్వలు అర్థ సెంచరీలతో మెరిశారు. ఈ ముగ్గురికి బ్యాటింగ్ లైనప్‌లో కామిందు మెండిస్, లహిరు ఉదార సహకారం దక్కితే పరుగుల వేటలో కష్టాలు ఉండవు. కానీ బౌలింగ్ విభాగంలో స్పిన్నర్లు పూర్తిగా తేలిపోయారు. కేశర నువాంత, ప్రభాత్ జయసూర్య భారత్‌ను ఇరకాటంలో పెడతారనే అంచనాలు తలకిందులయ్యాయి. ఈ ఇద్దరిని భారత బ్యాటర్లు అలవోకగా ఆడారు. పేసర్లు ఫెర్నాండో, కుమార సైతం ప్రభావం చూపించలేదు. బ్యాట్‌తో శ్రీలంక మెరుగ్గానే కనిపిస్తున్నా.. టెస్టుల్లో విజయానికి బౌలర్లు 20 వికెట్లు పడగొట్టాలి. ఇక్కడే ఆతిథ్య శ్రీలంక బలహీనంగా కనిపిస్తోంది.

# నష్టాలతో బంగ్లా బీపీఎల్ రద్దు!!

ఇండియాతో స్వదేశంలో జరగాల్సిన కీలక ద్వైపాక్షిక సిరీస్ తేదీలు మారే అవకాశం ఉందని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ తమీమ్ ఇక్బాల్ పేర్కొన్నాడు. బీసీబీ తన వార్షిక క్యాలెండర్‌ను పునర్వ్యవస్థీకరిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తిందని తెలుస్తోంది. షేర్-ఎ-బంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 9 వరకు అండర్-17, అండర్-19, అండర్-23 విభాగాల ఆటగాళ్లతో గేమ్ డెవలప్‌మెంట్ టోర్నమెంట్‌ను బీసీబీ జరుపనుంది. ఇండియాతో సిరీస్ షెడ్యూల్ ఖరారైన తర్వాతే మిర్పూర్ లేదా బసుంధర గ్రౌండ్‌లో వేదికలను సర్దుబాటు చేస్తామని పేర్కొన్నాడు. ఢిల్లీ వేదికగా సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు ఆఫ్ఘనిస్తాన్‌తో ఇండియా మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉండటంతో సెప్టెంబర్ విండోలో ఇండియా-బంగ్లా సిరీస్ దాదాపు అసాధ్యమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ టూర్ ఖరారైతే బంగ్లాకు కనకవర్షం కురుస్తుందని, అందుకే టూర్ పై గంపెడాశలు పెట్టుకుందని నిపుణులు పేర్కొంటున్నారు. అవినీతి ఆరోపణలు, వివాదాల్లో చిక్కుకున్న బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ ఈ ఏడాది నిర్వహించకపోవచ్చని తమీమ్ పేర్కొన్నాడు. గత రెండు సీజన్లలో బీపీఎల్ కారణంగా బీసీబీ దాదాపు 40 కోట్ల బంగ్లాదేశ్ టాకా (రూ. 31 కోట్లు) నష్టపోయిందని తెలిపాడు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రతీ ఏటా టోర్నీని నిర్వహించడం ముఖ్యం కాదని, అవసరమైతే సరైన ఫార్ములా కోసం ఒకటి లేదా రెండేళ్లు సమయం తీసుకుంటామని వెల్లడించాడు. ఫ్రాంచైజీలతో సంప్రదింపులు మొదలయ్యాయని, డిఫాల్టర్ల సమస్యలు, చెల్లింపులు, బ్యాంక్ గ్యారెంటీలను పరిష్కరించిన తర్వాతే టోర్నీని లాభదాయక మార్గంలోకి తెచ్చి నిర్వహిస్తామని పేర్కొన్నాడు.వచ్చే ఏడాది ఏప్రిల్-మే నాటికి ఫ్రాంచైజీలను సిద్ధం చేయాలని బోర్డు ప్రణాళికగా ఉంది. ఎవరైనా తప్పుకుంటే ప్రత్యామ్నా యాన్ని చూసేందుకు తగిన సమయం అవసరమని, దేశవాళీ క్యాలెండర్ పనుల్లో 60-70 శాతం పూర్తయిందని తమీమ్ పేర్కొన్నాడు. లీగ్ రద్దయితే క్రికెటర్లకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తనకు తెలుసని, బోర్డు భవిష్యత్తు కోసమే ఈ కఠిన నిర్ణయా లు తీసుకుంటున్నట్లు ఆటగాళ్లకు వ్యక్తిగతంగా వివరిస్తున్నానని తెలిపాడు. సరైన మార్పులతో రాబోయే రోజుల్లో కొత్త రూపంలో ముందుకొస్తామని బోర్డు ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ సందర్భంగా భారత్‌తో సంబంధాలు తెంచుకుని, టోర్నీని బహిష్కిం చిన బంగ్లాకు.. ఇప్పుడు బుద్ధి వచ్చిందని, ఇండియా విలువ తెలిసి వచ్చిందని భారత ఫ్యాన్స్ భావిస్తున్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక







**చిరు పుట్టిన రోజు కానుక.**

## మెగా అభిమానులకు 'కాకా' ట్రీట్!

మెగాస్టార్ చిరంజీవి తన పుట్టినరోజు (ఆగస్ట్ 22) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చారు. ఆయన కథానాయకుడిగా, టాలెంటెడ్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో రూపొందుతున్న 'మెగా 158' చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'కాకా' అనే పేరును ఖరారు చేస్తూ, ఒక పవర్‌ఫుల్ టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ ప్రకటనతో మెగా అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి.ఈ చిత్రంలో చిరంజీవి 'సత్యం' అనే మధ్యతరగతి వ్యక్తి పాత్రలో కనిపించనున్నారు. అయితే, టైటిల్ గ్లింప్స్‌లో ఆయనను యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో, గన్స్ పేలుస్తూ మాస్ అవతార్‌లో చూపించారు. దీంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. గతంలో 'వాల్తేరు వీరయ్య'తో సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించిన ఈ కాంబినేషన్, మరోసారి అదే పండగకు రానుండటం విశేషం.'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి-బాబీ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'కాకా'పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ స్టంట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో చిత్రీకరించిన ఒక భారీ ఫైట్ ఎపిసోడ్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. ఈ యాక్షన్ సన్నివేశాల్లో చిరంజీవి ఎంతో అంకితభావంతో, డూప్ లేకుండా రిస్కీ స్టంట్స్ చేశారని తెలుస్తోంది. మునుపెన్నడూ చూడని రీతిలో చిరంజీవి ఈ ఫైట్‌లో కనిపిస్తారని టాక్.ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ చిత్రాలు నిర్మిస్తున్న ఈ సంస్థకు తెలుగులో ఇదే తొలి సినిమా. ఈ సినిమాలో నివేదా పేతురాజ్, మలయాళ నటి అనశ్వర రాజన్ కీలక పాత్రలు పోషిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు.




## రవితేజ 'ఇరుముడి' జోరు.. అదనపు స్క్రీన్లు, షోలు

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుండటంతో, తెలుగు రాష్ట్రాల్లో అదనపు షోలను, మరిన్ని థియేటర్లను జోడిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేకర్స్ తెలిపారు.ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ మంచి వసూళ్లను సాధిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొత్త థియేటర్లను జోడించడంతో పాటు, ఉన్న థియేటర్లలోనూ అదనపు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది.'రవన్న బాక్సాఫీస్ దండయాత్ర' కొనసాగుతోందని చిత్రబృందం ప్రచార చిత్రాల ద్వారా పేర్కొంటోంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం అదనపు ఆకర్షణగా నిలిచింది. టీ-సిరీస్ ఫిలిమ్స్ సమర్పణలో విడుదలైన 'ఇరుముడి', రవితేజ అభిమానులను, మాస్ సినీ ప్రియులను అలరిస్తూ థియేటర్లలో విజయవంతంగా తన ప్రదర్శనను కొనసాగిస్తోంది.

## 'అల బొలెలో' సాంగ్ పూర్ణ స్టెప్పులు అదుర్స్!

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమా నుంచి తొలి పాట 'అల బొలెలో'ను శుక్రవారం విడుదల చేసి అభిమానులకు పండగలాంటి వార్త చెప్పింది.
యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ ఫుట్ ట్యాపింగ్ నంబర్‌ను ఆయనే స్వయంగా ఆలపించడం విశేషం. దర్శకుడు అరుణ్‌రాజా కామరాజ్ దీనికి సాహిత్యం అందించారు. అయితే, ఈ పాటలో సంగీతం, సాహిత్యం కంటే ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సమకూర్చిన స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా నటి పూర్ణ (షామ్నా కాసిం) తన అద్భుతమైన డ్యాన్స్‌తో, హావభావాలతో ఎంతగానో ఆకట్టుకున్నారు.
ఆమె డ్యాన్స్ పాటకు ప్రత్యేక కళను తెచ్చిపెట్టింది.ఈ చిత్రంలో భాగం కావడంపై నటి పూర్ణ ఇటీవల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ""జైలర్ 2' లాంటి భారీ చిత్రంలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఇది ఒక కల నిజమైనట్లుంది" అంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు రజినీకాంత్, దర్శకుడు నెల్సన్, అనిరుధ్, జానీ మాస్టర్‌తో పాటు చిత్ర బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.కాగా, ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. గతంలో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ టీజర్‌లో నటుడు వినాయకన్ చెప్పిన డైలాగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. "నన్ను చంపి నువ్వు ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్!" అంటూ ఆయన చెప్పే డైలాగ్, ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్ ఎంట్రీ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.




## 'స్పిరిట్' వివాదం.. ఒక్క 'లైక్'తో వంగా బ్రదర్స్‌కు దీపిక పదుకొణె స్ట్రాంగ్ రిప్లై

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం 'స్పిరిట్' చుట్టూ అలుముకున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంపై నిర్మాత, సందీప్ రెడ్డి సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా చేసిన ఆరోపణలకు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొణె పరోక్షంగా, కానీ చాలా బలంగా స్పందించారు. వంగా సోదరులను విమర్శిస్తూ రాసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను 'లైక్' చేయడం ద్వారా ఆమె తన వైఖరిని స్పష్టం చేశారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ.. దీపిక ఈ సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడిగారని, డేట్స్ సర్దుబాటు చేయలేకపోయారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా చర్చలు విఫలమయ్యాక సినిమా కథ, పాత్రకు సంబంధించిన అంతర్గత విషయాలను ఆమె లీక్ చేశారని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్థికంగా తమకు వర్కవుట్ కాకపోవడం వల్లే ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని వివరించారు.ఈ ఆరోపణలపై దీపిక నేరుగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ, ఓ జర్నలిస్ట్ పెట్టిన పోస్ట్‌కు ఆమె మద్దతు తెలిపారు. "దీపిక 10% లాభం అడిగితే, మొత్తం వంగా ఆస్తిని అడిగినట్టు ఎందుకు ఫీల్ అవుతున్నారు? ఇది స్పష్టంగా మగ అహంకార సంక్షోభం. ఒక మహిళ 'నో' చెప్పడాన్ని వీరు జీర్ణించుకోలేకపోతున్నారు" అని ఆ పోస్ట్‌లో జర్నలిస్ట్ పేర్కొన్నారు.ఏళ్ల తరబడి మగ స్టార్లు లాభాల్లో వాటాలు, అనుకూలమైన పని గంటలు వంటివి డిమాండ్ చేస్తున్నారని, అలా చేస్తే వారిని 'క్రమశిక్షణ' గలవారని అంటారని, అదే ఒక మహిళా స్టార్ అడిగితే 'ఇబ్బంది పెట్టే వ్యక్తి'గా ముద్ర వేస్తారని ఆ పోస్ట్ విమర్శించారు. ఒప్పందం రద్దయి నెలలు గడుస్తున్నా వంగా సోదరులు ఇంకా ఆమె గురించే మాట్లాడటం వృత్తి నైపుణ్యం కాదని, ఇది పూర్తిగా లింగ వివక్ష, మగ అహంకారమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. "ఆమె నో చెప్పింది. దాన్ని అంగీకరించి ముందుకు సాగండి" అంటూ పోస్ట్‌లో జర్నలిస్ట్ రాసుకొచ్చారు. మొత్తానికి దీపిక నేరుగా స్పందించకపోయినా తన మద్దతు ద్వారా ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు. కేవలం రెమ్యూనరేషన్, డేట్స్ సమస్యగా మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు ఇండస్ట్రీలో లింగ సమానత్వం, మగ అహంకారంపై తీవ్ర చర్చకు దారితీసింది.




## ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్' ట్యాగ్‌పై ప్రభాస్ రియాక్షన్

భారతీయ సినీ పరిశ్రమలో -బాహుబలి- చిత్రంతో పాన్-ఇండియా సంస్కృతికి శ్రీకారం చుట్టిన ప్రభాస్ తన ఇమేజ్‌కు ఏమాత్రం గర్వం ఆపాదించుకోని అరుదైన వ్యక్తిత్వంతో కనిపిస్తారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం -స్పిరిట్-లో ప్రభాస్ పేరు ముందు -ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్- అని వేయబోతున్నారనే వార్త అప్పట్లో సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ భారీ ట్యాగ్‌ను ప్రభాస్ ఎలా స్వీకరించారనే దానిపై నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా స్పందిస్తూ.. ప్రభాస్ గారి స్వభావానికి అద్దం పట్టే పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.సాధారణంగా నటులు తమ బిరుదులు, ప్రచార ట్యాగ్‌ల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అయితే ప్రభాస్ విషయంలో ఈ ప్రకటన ఎలా జరిగింది అన్న ప్రశ్నపై నిర్మాత వివరణ ఇస్తూ... టైటిల్ ఆవిష్కరణకు ముందే ఈ అంశాన్ని ఆయనతో ప్రస్తావించినట్లు తెలిపారు. దీనికి ప్రభాస్ ఎంతో క్యాజువల్‌గా తన సహజ సిద్ధమైన శైలిలో -మీ ఇష్టం డార్లింగ్- అంటూ ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా అంగీకారం తెలిపారట. ఈ ఒక్క చిన్న సమాధానం ప్రభాస్ నిరాడంబరతను, మేకర్స్‌పై ఆయనకు ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తోంది.ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న ప్రభాస్ షూటింగ్ షెడ్యూళ్ల సర్దుబాటులో ఎంతో ఫ్లెక్సిబుల్‌గా వ్యవహరిస్తున్నారని నిర్మాత ప్రణయ్ వంగా పేర్కొన్నారు. ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న -ఫౌజీ- చిత్రం పూర్తయిన వెంటనే.. ఆయన పూర్తి స్థాయిలో -స్పిరిట్- సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు. రెండు భిన్నమైన మేకింగ్ శైలులు కలిగిన సినిమాల మధ్య ఎంతో నైపుణ్యంతో సమన్వయం పాటిస్తూ.. ప్రభాస్ డేట్లను కేటాయిస్తున్నారని ప్రణయ్ రెడ్డి వంగా కొనియాడారు.



## సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

తమిళ చిత్ర పరిశ్రమలో మరోసారి సంక్షోభం నెలకొంది. ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో, 2026 సెప్టెంబర్ 1 నుంచి కొత్త సినిమాల విడుదలను నిలిపివేయాలని తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) కీలక నిర్ణయం తీసుకుంది.ఈ వివాదానికి ప్రధాన కారణం.. థియేటర్లలో విడుదలైన సినిమాలను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ చేసే కాలపరిమితి. సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలోకి రావాలని థియేటర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సినిమాలు త్వరగా ఓటీటీలో అందుబాటులోకి రావడం వల్ల ప్రేక్షకులు థియేటర్లకు రావడం తగ్గుతోందని, తద్వారా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిర్మాతలు మాత్రం తమ వాణిజ్యపరమైన వెసులుబాటును కోరుకుంటున్నారు. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు కొత్త సినిమాలను విడుదల చేయకూడదని నిర్మాతల మండలి స్పష్టం చేసింది. అయితే, ఇది పూర్తిస్థాయి బంద్ కాదని, సినిమా షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, తమిళనాడు థియేటర్ యజమానుల సంఘం ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం సెప్టెంబర్ నెలతో పాటు ఆ తర్వాత విడుదల కావాల్సిన పలు చిత్రాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613